క్లుప్తంగా

అన్నారం దర్గాలో ప్రార్థనలు



పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ యాకూబ్ షావలీ దర్గాలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపల్లె రంగనాథ్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత ఆయన్ను యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొక్కల ప్రమోద్, మండల అధ్యక్షుడు గొడుగు వినయ్, నియోజకవర్గ జనరల్ సెక్రటరీ భూక్య విజేందర్, అన్నారం గ్రామ కమిటీ అధ్యక్షుడు గొడుగు రమేష్, నాయకులు అఖిల్, పృథ్వీ, చీకటి రాజేష్, అఖిల్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కోనాపురంలో జేడీఈఎం బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ఎబినేజర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. యేసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన దినంగా ఈస్టర్ వేడుకలను పురస్కరించుకొని ఊరంతా తిరుగుతూ సువార్తను ప్రకటించారు. కార్యక్రమంలో తాండ్ర జాషువా, బుర్రి అశోక్, ఈసంపెల్లి రాజు, చిలువేరు నగేష్, ఈదుల నర్సయ్య, అనిల్, మాణిక్యం, రాజేష్, రాజన్ కుమార్, రవి, అఖిల్, కార్తీక్, ప్రవీణ్, సందీప్, మల్లేష్, ఆనందం, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



ఖానాపురం : పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఐనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ మాధవి ఆధ్వర్యంలో ఆదివారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అలాగే చిన్నారుల తో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాధవి మాట్లాడారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లతో అనారోగ్య సమస్యలు దూరమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ కార్యకర్త జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ యశోద, ఆయాలు శోభ, సునీత, భద్రమ్మ, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెల అందజేత



రాయపర్తి : మండలంలోని ఊకల్‌కు చెందిన పేద రైతు పాలెపాక కిష్టయ్య కుమారుడు రాజవర్ధన్ వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాల శ్రీనివాస్ దంపతులు ఆదివారం పుస్తెమట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. పేదలకు అండగా ఉంటానని చెప్పారు. సమాజంలోని ప్రతిఒక్కరూ తమకు కలిగిన దాంట్లో కొంత పేదలకు సాయం అందించాలని ఆకాంక్షించారు.

కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు సురేష్

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గొల్లపెల్లి సురేష్, ఉపాధ్యక్షుడుగా దబ్బెట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొల్లం హరీష్, అధికార ప్రతినిధిగా షేక్ హుస్సేన్, కార్యదర్శులుగా నాగుల రమేష్, చెడిపాక అశోక్, పెద్దపెల్లి యాకన్న, కోశాధికారులుగా నాలగిరి మధు, రబ్బాని, సభ్యులుగా మానుపాటి రాజు, ప్రకాష్, బానోతు నగేష్, చల్ల యాకన్న, కోడి రాకేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడారు. విగ్రహ ఏర్పాటులో క్రియాశీలకంగా పని చేస్తామని చెప్పారు.

'విభేదాలు సరికాదు'

పర్వతగిరి : బీజేపీలో విభేదాలు సృష్టించడం సరికాదని ఆ పార్టీ నాయకుడు బాదావత్ మారుతినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వెలిబుచ్చారు. పార్టీలో గిరిజనులను అణగదొక్కాలనే ఉద్దేశ్యంతో కొందరు నాయకులు అపోహలు కల్పించేలా పత్రికా ప్రకటనలు విడుదల చేస్తున్నారని ఆరోపించారు. పార్టీలో గిరిజనులకు సముచిత ప్రాధాన్యత ఉన్న క్రమంలో తమకు పదవులు వస్తున్నాయని పేర్కొన్నారు. పార్టీ పరంగా పదవులను అడ్డుకునే కుట్రలు మానుకుని పార్టీ బలోపేతానికి సమన్వయంతో సాగాలని ఆకాంక్షించారు.

సాగులో భూసార పరీక్షలు కీలకం

- వేసవి దుక్కులతో ప్రయోజనం
- ముందస్తు ప్రణాళికతో అధిక దిగుబడులు
- ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త నాగభూషణం



దుగ్గొండి : వేసవికాలం మొదలైంది. యాసంగి పంటలు చేతికొచ్చాయి. ఎండాకాలంలో దుక్కిదున్నడం, గతేడాదికి సంబంధించిన పంట అవశేషాలను, చెత్తను కాల్చివేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. జూన్‌లో తొలకరి వర్షాలు కురియగానే విత్తనాలు సమకూర్చుకుంటారు. సాగుకు ముందే రైతులు ప్రణాళికాయుతంగా ముందుకు సాగితే అధిక దిగుబడులు ఖాయమని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఆర్ఏఆర్ఎస్) సీనియర్ శాస్త్రవేత్త నాగభూషణం తెలిపారు. వేసవిలో రైతులు చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన సూచనలు, సలహాలు అందించారు.

భూసార పరీక్షలతో ప్రయోజనం

భూమిలో సారం ఎంత ఉంది. ఏ భూమిలో ఏ పంట వేయాలి? అని నిర్ధారించుకోవడానికి భూసార పరీక్షలు ఉపయోగపడతాయి. భూసార పరీక్షల కోసం మట్టిని సరైన పద్ధతిలో సేకరించాలి. భూసార పరీక్షలతో భూమిలో ఏయే పోషకాలున్నాయి. తక్కువ మోతాదులో ఏమున్నాయి. ఏ పంట సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందనే విషయాలు భూసార పరీక్షలో తేలుతాయి. భూసార పరీక్షలతో అదనపు ఖర్చులు తగ్గించుకునే అవకాశమూ ఉంది. నూతన ఆధునిక యంత్రాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చు.

వ్యర్థాలను నేలలోనే కలియదున్నాలి

రైతులు పంట భూముల్లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న అవశేషాలను కోసి కుప్పగా చేసి కాల్చుతుండడం పాత పద్ధతి. అలా కాకుండా పత్తి మొదళ్లు, మొక్కజొన్న సొప్పను వృథా చేయకుండా మొదట రోటోవేటర్‌తో కలియదున్నాలి. అనంతరం ట్రాక్టర్ నాగలితో దున్నాలి. తదనంతరం మరోసారి రోటోవేటర్‌తో కలియదున్నాలి. తద్వారా భూమి సారవంతంగా మారి పత్తి, ఇతర పంటలు వేసినప్పుడు బయటి నుంచి అందించాల్సిన ఎరువుల భారం తగ్గుతుంది.



నేలను లోతుగా దున్నుతున్న ట్రాక్టర్

వేసవి దుక్కులు కీలకం

వానాకాలం సాగుకు నెల రోజుల ముందే నేలను చదును చేసుకుని దుక్కులు మొదలుపెట్టాలి. తొలకరి వర్షం కురవక ముందే విత్తడానికి నేలను సిద్ధం చేయాలి. కోతల తర్వాత నేలను దుక్కి దున్నితే చీడపీడల బెడద నివారించవచ్చు. నేలనే లోతుగా దున్నుకోవడం వల్ల కీటకాలు నశించిపోతాయి. దున్నడం వల్ల వరుసల మధ్యలో వర్షపు నీరు నిలిచి నేలలోకి అవసరమైన మేరకు ఇంకుతుంది. మొదటిసారి దుక్కి దున్నాక పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, చెరువు మట్టిని పొలంలో వేసుకుంటే దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది. సేంద్రియ ఎరువుల వాడకంతో సూక్ష్మ పోషకాల లోపాలు తొలగిపోతాయి. నేలను బలంగా లోపలికి దున్నడం వల్ల భూమి గుల్లబారుతుంది. 30–40 సెంటీమీటర్ల లోతుగా దున్నితే భూమిలోని గట్టి పొరపగిలి నేల గుల్లగా తయారవుతుంది. విత్తనం వేయగానే మొలకెత్తి వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది మొక్క ఏపుగా పెరిగి అధిక దిగుబడులు లభిస్తాయి.

సమన్యాయమే ప్రభుత్వ ధ్యేయం



గీసుకొండ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



సంగెం : మాట్లాడుతున్న మాధవరెడ్డి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : కులమతాలకు అతీతంగా ప్రజలకు సమన్యాయం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వంచనగిరిలో ఆదివారం రాత్రి నిర్వహించిన 'జై బాపు, జై భీం, జై సంవిధాన్' ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్త్వంతో తప్పుడు విధానాలు అవలంబిస్తోందని తెలిపారు. ముస్లిం వ్యతిరేక పార్టీగా బీజేపీ ముద్ర వేసుకుంటోందని చెప్పారు. రాజ్యాంగాన్ని సవరించే పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను హక్కులకు దూరం చేసేందుకు కుట్ర చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం లౌకికవాదంతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడుతోందని తెలిపారు. బీజేపీ చేపట్టిన తప్పుడు కార్యాచరణపై ప్రజలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని రామచంద్రాపురం, పెద్ద తండాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. మహనీయుల త్యాగాలను స్మరించుకునేలా గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించాలని శ్రేణులకు సూచించారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలందరూ నడుం బిగించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ నిర్వీర్యానికి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. అనంతరం సమసమాజ నిర్మాణానికి పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్టీ పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లు రమేష్, కేశవులు, నాయకులు నాగరాజు, కిశోర్, రవి, చంద్రశేఖర్, చిదురాల రజిత రాజు, వేల్పుల బాబు, సారయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని తూర్పుతండా, గుగులోతుతండా, ఏనుగల్, మాల్యాతండ, మూడెత్తులతండాలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్‌ను అవమానించేలా రాజ్యాంగ సవరణకు పాల్పడుతోందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసే దిశగా గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, మండల కోఆర్డినేటర్ సంతోష్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు జాటోతు తిరుపతి, బానోతు చందు, తౌర్రి కుమార్, భూక్య శ్రీనివాస్, మూడు యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ

నర్సంపేట : హన్మకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, జిల్లా నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 17, 18వ వార్డుల్లో ఆదివారం సన్నాహక సమావేశాలకు వెంకటనారాయణ, మనోహర్ రెడ్డి హాజరై మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు రాబోయే రోజుల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలూ సభకు హాజరు కావాలని కోరారు. సమావేశాల్లో మాజీ కౌన్సిలర్లు బండి ప్రవీణ్, వాసం సాంబయ్య, శివరాత్రి స్వామి, బీసీ సెల్ అధ్యక్షుడు పుల్లూరి స్వామి, 17వ వార్డు కమిటీ అధ్యక్షుడు రచ్చ రఘు, 18వ వార్డు కమిటీ అధ్యక్షుడు రాయరాకుల సారంగపాణి, నాయకులు అప్పాల సుదర్శన్, తోటకూరి సదానందం, సకినాల రవి, నాతి రమేష్, పుల్లూరి రాంబాబు, కొమరయ్య, నాతి సదానందం, వేల్పుల శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

మండలంలోని ఖాదర్‌పేట, గొల్లపల్లి, గొల్లభామ తండా, సూర్యపేటతండాల్లో నిర్వహించిన సమావేశాల్లో బీఆర్ఎస్ మండల బాధ్యుడు, సీనియర్ నాయకుడు బాల్నె వెంకన్న మాట్లాడారు. అనంతరం రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశాల్లో మాజీ ఎంపీపీ జక్క అశోక్, మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి, అమీనాబాద్ సొసైటీ వైస్ చైర్మన్ మల్లయ్య, మాజీ సర్పంచ్‌లు హంస విజయరామరాజు, గుగులోతు లాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మునీశ్వర్

నర్సంపేట : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ గోదాములో మే 11న నిర్వహించనున్న తెలంగాణ స్టేట్ సివిల్ సప్లై హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ కోరారు. పట్టణంలోని సివిల్ సప్లయీస్ గోదాంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. హమాలీలను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు అమలు చేయాలని, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని, సహజ మరణం చెందితే అంత్యక్రియలకు రూ.30 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాల సవరణను వ్యతిరేకంగా పోరాడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, రవి, కిశోర్, నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు 'ఎస్ఆర్ఆర్' చేయూత

- ఫౌండేషన్ ప్రతినిధి రంగారెడ్డి



బియ్యం, ఆయిల్ క్యాన్ అందజేస్తున్న రంగారెడ్డి

రాయపర్తి : మండలంలోని పేద, బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆపత్కాలంలో చేయూత అందిస్తుందని ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కొండాపురంలో ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందిన పాక సోములు, జిలుకర భిక్షపతి, తరాల నర్సయ్య కుటుంబాలకు బియ్యం, ఆయిల్ క్యాన్‌తోపాటు ఆర్థికసాయం అందజేశారు. అలాగే రాయపర్తిలో సుల్తానా కుటుంబానికి బియ్యం, ఆయిల్‌క్యాన్, నగదు అందజేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడారు. చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆశయం మేరకు ఫౌండేషన్ పేద కుటుంబాలకు అండగా ఉంటోందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పేదలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఫౌండేషన్ బాసటగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, నాయకులు ఐత రాంచందర్, గజవెల్లి ప్రసాద్, అశ్రఫ్ పాషా, చందు రాము, మోయినొద్దీన్, తేరాల యాకయ్య, రాజు, పాక మహేందర్, కనుకుంట్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులతో నాగార్జునరెడ్డి

నెక్కొండ : మండల కేంద్రంలోని విద్యోదయ పాఠశాలలో 2013–14 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన నాటి విద్యార్థులు దశాబ్ద కాలం తర్వాత కలుసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జునరెడ్డి మాట్లాడారు. పూర్వవిద్యార్థులు సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జీవితంలో నైతిక విలువలు కీలకమన్నారు. ఉత్తమ పౌరులుగా జీవించాలని ఆకాంక్షించారు. సామాజిక సేవలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్‌లోనూ స్నేహం కొనసాగించాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చల్లా పారిజాతం, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మొరం దందా

- వృక్షాలను కూల్చుతూ 'వాల్టా'కు తూట్లు
- రాత్రివేళల్లో భారీగా తరలింపు
- కొందరు అధికారుల కనుసన్నల్లోనే..?



మొరం తరలింపుతో రైతుకు వ్యవసాయానికి కలిసొచ్చిన భూమి

సంగెం : మండలంలో మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. వృక్షాలను సైతం నేలకూల్చుతూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ప్రభుత్వ అనుమతి లేకున్నా వరంగల్, ఇతర ప్రాంతాల్లోని వెంచర్లకు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని షాపూర్, తీగరాజుపల్లి గ్రామాల శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌కు ఇరువైపుల నుంచి హిటాచీ, జేసీబీల సాయంతో టిప్పర్ల ద్వారా అక్రమార్కులు మొరం దందా సాగిస్తున్నారు. గ్రామంలోని ప్రజలు ఇంటి నిర్మాణ అవసరాలకు మొరం తరలిస్తే కేసులు పెడుతున్న అధికారులు మొరం దాందా ఎందుకు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారుల కనుసన్నల్లోనే దందా నెలలుగా సాగుతోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎస్సారెస్పీ కెనాల్ గట్టుకు ఇరువైపులా మొరం తొలగిస్తుండడంతో సంబంధిత రైతులకు ఎకరాల కొద్ది భూమి సాగులోకి కలిసొస్తుండడంతో వారు సైతం అక్రమార్కులతో చేతులు కలుపుతున్నట్లు తెలుస్తోంది. కొందరు రైతులు వారి వ్యవసాయ భూములకు అనుకుని ఉన్న మొరం తరలింపుకు డబ్బు సైతం తీసుకుంటున్నట్లు సమాచారం. రోజూ రాత్రివేళల్లో మొరం తరలిస్తూ భారీ వృక్షాలను సైతం నామరూపాలు లేకుండా చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మొరం దందాను అరికట్టి, అక్రమార్కులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వివరణ కోసం ప్రయత్నించగా అధికారులెవరూ అందుబాటులోకి రాలేదు.



నేలకూలిన వృక్షాలు

ఆర్థికసాయం



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన ఐత వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.3 వేల సాయం అందజేశారు. తొలుత వెంకటమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గారె రాజు, గారె ప్రవీణ్, బందు రాజు, తాటికాయల రవీందర్, వేల్పుల యాకయ్య, గారె రాజు, గారె నవీన్, గారె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని ఓర్వలేక ఆరోపణలు'

కొత్తగూడ : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడ, గంగారం మండలాల్లో రోడ్లు, బ్రిడ్జిలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుంటే ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు నారాయణరెడ్డి, విజయ, రూప్‌సింగ్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అరుణ



అరుణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మహిళా అధ్యక్షురాలిగా మరుపల్ల అరుణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హనుమకొండలోని అతడి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నియామక పత్రం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధిపై మహిళలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, నాయకులు వెంకన్న, కుల్లా యాకాంతం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని ఇల్లందలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లంద శివారులో లారీ ప్రమాదానికి గురి కాగా రికవరీ వాహనంతో లారీని తీసుకెళ్తుండగా ఆ వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న ఓబులాపురం గ్రామానికి చెందిన గబ్బెట కుమార్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

కిరాణా షాపులో చోరీ



విచారణ చేస్తున్న ఎస్సై మహేందర్

నెక్కొండ : మండలంలోని కస్నాతండా పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలోని పానుగంటి అశోక్‌కు చెందిన కిరాణం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్‌ను గడ్డపారతో లేపి షాపులో చొరబడి రూ.9 వేల నగదుతోపాటు సుమారు రూ.2300 విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు. ఎస్సై మహేందర్ షాపును ఆదివారం సందర్శించి విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.